సత్యమేవ జయతే

# సాక్షి

Date: 29th October 2017

# భవిష్యత్ డేటా ఎనలిటిక్స్‌దే..



జ్యోతిప్రజ్వలనతో బిజినెస్ కాంక్లేవ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

- దాని వినియోగంతో అద్భుత ప్రయోజనాలు
- కాన్‌ఫ్లక్స్ 2017 బిజినెస్ కాంక్లేవ్‌లో నిపుణులు

**సాక్షి, విశాఖపట్నం:** భవిష్యత్ డేటా ఎనలిటిక్స్ రంగానిదేనని పలువురు నిపుణులు పేర్కొన్నారు. డేటా ఎనలిటిక్స్ వినియోగించుకోవడం ద్వారా వ్యాపార, మార్కెటింగ్, సాంకేతిక, ఉత్పాదన, ఆతిథ్య రంగాల్లో అద్భుత ప్రయోజనాలు పొందవచ్చని అభిప్రాయపడ్డారు. విశాఖ ఐఐఎం ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఓ హోటల్లో కాన్‌ఫ్లక్స్-2017 బిజినెస్ కాంక్లేవ్ జరిగింది. ఈ సమావేశంలో డెలాయిట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ శ్రీరాందాస్ మాట్లాడుతూ ఎనలిటిక్స్ మార్కెటింగ్ రంగానికి ఎంతో ప్రయోజనకరమన్నారు. దీని ద్వారా వినియోగదారునికి ఏమి కావాలో తెలుసుకునే వీలుంటుందన్నారు. జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థ ప్రతినిధి షర్మిష్ఠ బిశ్వాస్ మాట్లాడుతూ ఎనలిటిక్స్ వినియోగం వల్ల వ్యాపారం దెబ్బతినకుండా ముందే జాగ్రత్త పడవచ్చన్నారు. ఎర్నస్ట్ అండ్ యంగ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ అన్షుమన్ ఘోష్ మాట్లాడుతూ డేటా ఎనలటిక్స్ వినియోగంతో అనారోగ్యంతో ఆస్పత్రులకు వెళ్తున్న వారి సమగ్ర రోగ సమాచారం నిక్షిప్తం అవుతుందన్నారు. దీనిని బట్టి గతంలో వారి అనారోగ్య సమస్యలు, భవిష్యత్‌లో సంక్రమించబోయే రోగాలను ముందుగా అంచనా వేసే అవకాశం కలుగుతుందని చెప్పారు. ఆదిత్య బిర్లా గ్రూప్ కస్టమర్ ఎనలిటిక్స్ హెడ్ ఉత్కర్ష్ బి.సోమయ్య మాట్లాడుతూ ఎనలిటిక్స్‌తో ఏ డేటా వినియోగిస్తే ఎలాంటి ఫలితాలుంటాయో తెలుసుకోవడంతో పాటు వినియోగదారులకు కావలసినవి ముందుగానే అంచనా వేసి వాటిని అందుబాటులో ఉంచడానికి దోహదపడుతుందని తెలిపారు. జేపీ మోర్గాన్ చేజ్ అండ్ కంపెనీ గ్లోబల్ ఎనలిటిక్స్ సెంటర్ హెడ్ మేహల్ భగాడియా మాట్లాడుతూ ఎనలిటిక్స్ బ్యాంకింగులోనూ ఉపయోగపడుతుందని చెప్పారు. దీని ద్వారా రీపేమెంట్లపై అవగాహన కలుగుతుందని, దీని ద్వారా రుణ ఎగవేతదార్లను గుర్తించవచ్చని, ఇది బ్యాంకర్లకు రిస్కును బాగా తగ్గిస్తుందని వివరించారు. ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ హిమాద్రి గంగూలీ ఉత్పత్తిరంగంలో ఇండస్ట్రీ 4.0 గురించి తెలియజేశారు.

ఎనలిటిక్స్ డేటాతో సరైన నిర్ణయాలు తీసుకోవచ్చని, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవచ్చని చెప్పారు. అనంతరం గ్లోబల్ డెసిషన్ మేనేజిమెంట్ వైస్ ప్రెసిడెంట్ షిరీన్ ఆలీ, హెచ్ఎస్‌బీసీ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ కుమార్‌సింగ్, యాత్రా సంస్థ ఎడ్వాన్స్‌డ్ ఎనలిటిక్స్ హెడ్ రితేష్ ఎం.శ్రీవాస్తవ, ఐఎస్‌సీఈఏ చైర్మన్, సప్‌లై చైన్ ప్రొఫెషనల్ సందీప్ చటర్జీ ప్యానలిస్టులు ప్యానల్ చర్చల్లో పాల్గొన్నారు. ఈ సదస్సుకు ఐఐఎం విశాఖ డైరెక్టర్ చంద్రశేఖర్, ఐఐఎం విశాఖ, బెంగళూరు ప్రొఫెసర్ ఎం.ఎస్.రాజగోపాలన్ హాజరయ్యారు.